చురుకుగా అంతర్వేది రోడ్డు పనులు

- సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుంచి రూ.25 కోట్ల మంజూరు
- 10 కిలోమీటర్ల పొడవునా రెండు లేన్లుగా అభివృద్ధి



అంతర్వేది రోడ్డు పనుల్లో భాగంగా నిర్మాణమవుతున్న రిటైనింగ్ వాల్

మలికిపురం: ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేదికి రవాణా మార్గాలను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో బాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుంచి రూ.25 కోట్లు కేటాయించారు. దీంతో గత ఇరవై రోజులుగా రోడ్డు అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అంతర్వేది వెళ్లే ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా అత్యంత ఇరుకుగా ఉంది. గత పాలకులు పూర్తిగా వదిలేయడంతో సాధారణ ప్రజానీకంతో పాటు అంతర్వేది తీర్థ మహోత్సవాల సమయంలో భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర అవాంతరాలు ఏర్పడి భక్తులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఓఎన్జీసీ కార్యకలాపాలు కూడా ఇక్కడ అధికంగా ఉంటాయి. దీంతో భారీ వాహనాల తాకిడి ఇక్కడ అధికం. సుమారు 200 ఏళ్ల పైబడి నుంచి ఇక్కడ అంతర్వేది ఉత్సవాలకు రానురాను భక్తుల రద్దీ అధికమైంది. అలాగే సుమారు 40 ఏళ్ల నుంచి ఇక్కడ ఆయిల్ నిక్షేపాల వెలికితీత అధికంగా ఉంది. కానీ రోడ్ల వెడల్పు మాత్రం మరిచారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్యపై ప్రధానంగా దృష్టి పెట్టింది. అంతర్వేది నుంచి వయా కేశవదాసుపాలెం మీదుగా టేకిశెట్టిపాలెం వరకూ గల ప్రధాన ఆర్అండ్‌బీ రోడ్డును ఏడు మీటర్లకు వెడల్పు చేసి అభివృద్ధి చేయడానికి సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుంచి రూ.25 కోట్లు మంజూరయింది. టెండర్ల ప్రక్రియ పూర్తి కావడంతో గత 20 రోజులుగా రోడ్డు పనులు చురుకుగా సాగుతున్నాయి. మొత్తం 13.4 మీటర్ల రోడ్డులో పది కిలోమీటర్ల రోడ్డు ఏడు మీటర్లకు వెడల్పు చేస్తారు. రెండు లేన్లుగా అభివృద్ధి చేస్తారు. **మోరి జీసీఎస్ సమీపం నుంచి కేశవదాసుపాలెంలోని కాలువ మొగ మీదుగా అంతర్వేది ఆలయప్రాంతం వరకూ అభివృద్ధి జరుగుతుంది. రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా రోడ్డుకు చేర్చి** ఉన్న అంతర్వేది ప్రధాన పంట కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతుంది. మోరి జీసీఎస్ నుంచి కాలువ మొగ వరకూ సుమారు 800 మీటర్ల మేరక రిటైనింగ్ వాల్ నిర్మాణం జరుగుతుంది. కేశవదాసుపాలెం కాలువ మొగ నుంచి అంతర్వేది వరకూ పంట కాలువకు గతంలోనే రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు.

ఆరు నెలల్లో పనులు పూర్తి

వచ్చే ఆరు నెలల్లో రోడ్డు పనులు పూర్తయ్యేలా ఆర్ అండ్‌బీ ప్రణాళికలను రూపొందించింది. 2024 ఫిబ్రవరిలో అంతర్వేది ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఉత్సవాలకు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు పూర్తి కావాలని నిర్ణయించారు.

తీర ప్రాంత అభివృద్ధికి కీలకం



సెంట్రల్ రోడ్ ఫండ్స్ నుంచి మంజూరైన రూ.25 కోట్ల నిధులతో అభివృద్ధి కానున్న అంతర్వేది ప్రధాన ఆర్ అండ్‌బీ రోడ్డు సముద్ర తీర ప్రాంతాల అభివృద్ధిలో కీలకం కానుంది. అంతర్వేది రద్దీతో పాటు, వ్యవసాయ, వాణిజ్య, ఆయిల్ నిక్షేపాల రవాణాకు మార్గం విశాలంగా ఉంటుంది.

– రాపాక వర ప్రసాదరావు, ఎమ్మెల్యే, రాజోలు

పూర్తి నాణ్యతతో పనులు



అంతర్వేది ఆర్అండ్‌బీ రోడ్డు అభివృద్ధి పనులు పూర్తి నాణ్యతతో జరుగుతున్నాయి. తొలి దశలో పంట కాలువ వెంబడి రిటైనింగ్ వాల్ దాదాపు పూర్తి కావస్తుంది. మొత్తం పది కిలోమీటర్ల పొడవునా రెండు లేన్లుగా నిర్మాణం జరుగుతుంది.

– ఎ.రవి, డీఈ, ఆర్అండ్‌బీ, రాజోలు

హజ్ యాత్రికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



సజ్జాద్ హుస్సేన్

మామిడికుదురు: దేశ చరిత్రలో ముస్లిం, మైనార్టీలకు ఏ ప్రభుత్వం చేయని విధంగా రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహాయం అందిస్తున్నారని వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు సజ్జాద్ హుస్సేన్ పేర్కొన్నారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ హజ్ యాత్రికులకు ఇచ్చే సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూ.83 వేలకు పెంచడం ముదావహమన్నారు. గతంలో హజ్ యాత్రకు వెళ్లే తెల్ల రేషన్‌కార్డుదారుడికి రూ.60 వేలు, గులాబీ రంగు రేషన్ కార్డు ఉన్న వారికి రూ.30 వేల వంతున రాష్ట్ర ప్రభుత్వం సహాయం అందించలేదని సజ్జాద్ హుస్సేన్ గుర్తు చేశారు. ఈ సహాయాన్ని గణనీయంగా పెంచడం ద్వారా సీఎం జగన్ తనకు ముస్లిం, మైనార్టీలపై ఉన్న అభిమానాన్ని ఘనంగా చాటుకున్నారని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి హజ్ యాత్రకు వెళ్తున్న వారికి పెంచిన సాయం మంజూరు చేశారని సజ్జాద్ హుస్సేన్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో ఎంతో మంది పేద ముస్లిం మైనార్టీలు హజ్‌యాత్రకు వెళ్లే అరుదైన అవకాశం కలిగిందన్నారు. ముస్లిం మైనార్టీలు జగన్‌కు ఎంతో రుణపడి ఉన్నారని హుస్సేన్ పేర్కొన్నారు.

క్లుప్తంగా

బాధిత కుటుంబానికి సాయం



సహాయం అందించిన రెడ్ క్రాస్ ప్రతినిధులు

మలికిపురం: మండలంలోని తూర్పుపాలెంలో ఇటీవల సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన గంధం సాంబశివరావు కుటుంబానికి రెడ్ క్రాస్ సంస్థ అండగా నిలిచింది. వంట సామగ్రితో పాటు, బరకాలు, హైజెనిక్ కిట్, నిత్యావసరాలను గురువారం బాధిత కుటుంబానికి అందించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సూచనల మేరకు సంస్థ చైర్మన్ కేఎస్ నారాయణ పర్యవేక్షణలో ఈ సాయం అందించినట్లు సంస్థ స్థానిక సమన్వయకర్త జంపన బుజ్జిరాజు తెలిపారు. కార్యక్రమంలో అల్లూరు మధురాజు, బోనం రాజు, ఓరుగంటి బాలరాజు, వీరా కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి ఎమ్మెల్యే సాయం



వృద్ధ దంపతులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: మండలంలోని మెర్లపాలెంలో రావూరి పెదవెర్రియ్య, సుబ్బాయ్యమ్మ దంపతులకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.15 వేల ఆర్థిక సాయం అందించారు. నివాసం ఉంటున్న రేకుల షెడ్డు సీలింగ్ నిమిత్తం అందించారు. అలాగే అదే గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన అడబాల వెంకటేశ్వరరావును పరామర్శించి రూ.5 వేలు, అనారోగ్యంతో బాధపడుతున్న ముత్యాల దుర్గను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు.

పని దినాలు కల్పించాలి



వక్కలంకలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ రేవతి

అంబాజీపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో వీలైనంత మేరకు ఎక్కువ మందికి పని దినాలు కల్పించాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో చేపట్టిన కాలువ పూడికతీత పనులకు సర్పంచ్ రేవతి గురువారం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ జాబ్ కార్డులు కావాల్సిన వారు సచివాలయంలో సంప్రదించాలన్నారు. అధిక ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని త్వరగా పనులు ముగించుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ దారా నాగవేణి, ఫీల్డ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పి.గన్నవరం: మండలంలోని 11 కేవీ చాకలిపాలెం ఫీడర్ పరిధిలోని పలు గ్రామాల్లో ట్రీ కటింగ్ కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ తెలిపారు. కారణంగా ఎల్.గన్నవరం, మొండెపులంక, నాగుల్లంక, వాడ్రేవుపల్లి, చాకలిపాలెం, మానేపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పూడికతీత పనులు చేపట్టాలి

ఆలమూరు: పంట కాలువకు సాగునీరు నిలిపివేసిన దృష్ట్యా సత్వరమే పూడికతీత పనులు చేపట్టాలని కొత్తపేట బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు గౌడ్ అన్నారు. వెదురుమూడి పంట కాలువను స్థానిక బీజేపీ నేతలు నాగిరెడ్డి స్వామి, మేడపాటి సీతారామరెడ్డి, వడ్డి దొరయ్య నాయుడు తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. అలాగే పలు మద్యం దుకాణం వద్ద వ్యర్థాలు పంట కాలువలో పడేయడం వల్ల సాగునీరుకు ఆటంకం కలుగుతుందన్నారు.

గాయపర్చిన భార్య, అత్త, బావమరిదిలపై కేసు

అయినవిల్లి: గుర్తుతెలియని ఫోన్ నంబర్ నుంచి కాల్ రావడంపై భార్యను ప్రశ్నించిన భర్తను గాయపరిచిన ఘటనపై గురువారం స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి టీటీఆర్ నగర్‌లో కమిడి కిశోర్, సౌదామణి నివాసం ఉంటున్నారు. సౌదామణికి బుధవారం ఒక గుర్తుతెలియని ఫోన్ నెంబర్ నుంచి కాల్ రావడంతో భర్త కిషోర్ ప్రశ్నించాడు. తనను ప్రశ్నించడంతో భార్య సౌధామణి, అత్త పరమట కుమారి, బావమరిది రాజ్‌కుమార్ కోపంతో కిషోర్‌పై రక్తాలు వచ్చేలా దాడి చేసి గాయపరిచారు. దీనిపై బాధితుడు కిషోర్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం



ఎల్.గన్నవరంలో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఎన్ని అడ్డంకులు కల్పించినా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఎల్.గన్నవరంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సొసైటీ కమిటీ చైర్మన్ యన్నాబత్తుల ఆనంద్, నాయకులు మానుకొండ ప్రసాద్, గనిశెట్టి రామ గణపతి, అన్నాబత్తుల చంటి, చొల్లంగి చిట్టిబాబు తదితరులతో కలసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. చిట్టిబాబు మాట్లాడుతూ సీఎం జగన్ కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని వివరించారు. జగన్ అందిస్తున్న సుపరిపాలనను చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు పమ్మి అనిల్‌కుమార్, పోతుమూడి వెంకటేశ్వరరావు, పి.స్వప్న, మానుకొండ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

27న జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ

మామిడికుదురు: స్థానిక బస్టాండ్ కూడలిలో ఏర్పాటు చేసిన భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ ఈ నెల 27వ తేదీ శనివారం మధ్యాహ్నం జరుగుతుందని కమిటీ గురువారం తెలిపింది. విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని చెప్పారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు ఈ విగ్రహావిష్కరణలో పాల్గొంటారన్నారు. కరపత్రాల విడుదలలో దళిత సంఘాల నేతలు నూటుకుర్తి సత్యనారాయణ, మసూడి నరసింహస్వామి, కండెళ్ల వెంకటేశ్వరరావు, ముమ్మిడివరపు విజయభాస్కరరావు, కనపాల శ్రీను, ముసూడి ప్రభాకరరావు, కోట పరమేష్, ఆకుమర్తి వెంకటరమణ, ఆటో చిన్న పాల్గొన్నారు.

త్వరితగతిన కాజ్‌వే పనుల్ని పూర్తి చేస్తాం



కాజ్‌వే పనుల్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వర్షాల సీజన్ నాటికి కాజ్‌వే పనుల్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన పెదపట్నం–అప్పనపల్లి గ్రామాల సరిహద్దులో పాటు రేవుపై నిర్మాణంలో ఉన్న కాజ్‌వే పనుల్ని గురువారం ఎమ్మెల్యే పరిశీలించారు. వంతెన నిర్మాణంపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. గోదావరి వరద ప్రవాహానికి తట్టుకునే విధంగా కాజ్‌వేకు నాలుగు వైపులా రిటైనింగ్ వాల్స్ నిర్మిస్తామన్నారు. తదుపరి ఏటిగట్టు వైపు పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్డు నిర్మిస్తామని చెప్పారు. గోదావరి వరదలకు లంక గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా కాజ్‌వే పనుల్ని పూర్తి చేస్తామన్నారు. దీంతో పాటు పాశర్లపూడిలంక లూటుకుర్రు గ్రామాల సరిహద్దులో కాజ్‌వే కూలిపోయి నిలిచిపోయిన తాగునీటి సరఫరాను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రెండ్రోజుల్లో తాగునీటి సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ కశిరెడ్డి అంజనేయులు, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ బొంతు నీలిమ, దేవస్థానం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, గెడ్డం వెంకటేశ్వరరావు, తులా గోపాలకృష్ణ, బత్తుల జనార్దన్, భూపతి వెంకటపతి, నీతిపూడి గణేష్, విప్పర్తి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం



పెచ్చెట్టివారిపాలెంలో బాధితులకు సాయం పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: మాచవరం శివారు పెచ్చెట్టివారిపాలెంలో గురువారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకింటికి నిప్పంటుకుని రూ.రెండు లక్షల ఆస్తి నష్టం సంభవించింది. స్థానికుల తెలిపిన వివరాలిలా.. కొప్పిశెట్టి శ్రీనివాస్‌కు చెందిన తాటాకింటికి షార్ట్ సర్క్యూట్ సంభవించి అగ్నికి ఆహుతయింది. శ్రీనివాస్ ఇంటి అటకపై పేర్చిన కొప్పిశెట్టి బాల వెంకటరమణ (బాలాజీ)కి చెందిన రూ.1.50 లక్షల విలువైన 15 వేల కురిడీ కొబ్బరి కాయలు ఈ ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినప్పటికి సర్వం బూడిద పాలయింది. ఈ ప్రమాదంలో గృహోపకరణాలు కాలిపోయాయి. అమలాపురం అగ్నిమాపక అధికారులు సంఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2 లక్షలు ఆస్తి నష్టం సంభవించినట్లు అగ్నిమాపక ఎల్ఎఫ్ ఎం.బలరామ్, వీఆర్వో ఎన్.రమణ, ఆర్ఐ ఇబ్రహీం తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సాయం బియ్యం పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్య మోహన్, మట్టపర్తి సాంబయ్య, విత్తనాల శేఖర్, నందెపు సూరిబాబు, మట్టా వెంకటేశ్వరరావు పెచ్చెట్టి నాగభూషణం తదతరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ భూలక్ష్మి

పి.గన్నవరం: స్థానిక ఎంపీపీ అంబటి భూలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పి.గన్నవరం సెంటర్లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎండలో బయటకు రావద్దని సూచించారు. ఎంపీడీఓ టి.వెంకటాచార్య, సర్పంచ్ బొండాడ నాగలక్ష్మి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ఆదిమూలం సూరయ్య కాపు, పంచాయతీ కార్యదర్శి కుంపట్ల పోలరాజు, నాయకులు కర్రి బాబూరావు, పులపర్తి చిన నారాయణ మూర్తి, నేలపూడి దామోదం, అంబటి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: వేసవి తాపానికి ఉపశమనంగా ప్రజల దాహార్తి తీర్చేందుకు అంబాజీపేటకు చెందిన నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంచార మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారని సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి తెలిపారు. మాచవరం, అంబాజీపేట పరిసర ప్రధాన రహదారి మార్గంలో ప్రయాణికులకు, పాదాచారులకు గురువారం మజ్జిక పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ నాగాబత్తుల వెంకట సుబ్బారావు, సభ్యులు మజ్జిగను పంపిణీ చేసి వారి దాహార్తిని తీర్చారు. వాహనంపై తిరుగుతూ మజ్జిగను పంపిణీ చేయడంతో నాగాబత్తుల సాహెబ్ మెమోరియల్ ట్రస్ట్ సేవలను పలువురు అభినందించారు.

ప్రభుత్వ పథకాలతో మహిళల ఆర్థిక స్వావలంబన

- మెర్లపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం
- పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



మెర్లపాలెంలో గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

ఆత్రేయపురం: ప్రభుత్వ పథకాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారని వైఎస్సార్ ఆసరా, చేయూత, అమ్మ ఒడి తదితర పథకాలు మహిళలకు వరంగా మారాయని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్ ప్రభుత్వంలో అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి ప్రజల వద్ద నుంచి ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎవరు ఎన్ని చెప్పినా , ఏ ప్రభుత్వంలో ఎంత లబ్ధిపొందారో ప్రజలకు తెలుసనీ , ప్రతిసారి బటన్ నొక్కి వారి ఖాతాలకు సంక్షేమ పథకాల సొమ్మును అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞులైన ప్రజలు సమయం వచ్చినప్పుడు ఒక్కసారి బటన్ నొక్కి తమ కృతజ్ఞతలు తెలుపుతారన్నారు. మెర్లపాలెంలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రజలకు లబ్ధి చేకూరుందన్నారు. బీసీ లబ్ధిదారులకు రూ.3,61,82,788, ఎస్సీ లబ్ధిదారులకు రూ.2,37,56,708, ఎస్టీ లబ్ధిదారులకు రూ.14,57,780, మైనార్టీ లబ్ధిదారులకు రూ.4,77,308, కాపు లబ్ధిదారులకు రూ.5,27,72,880, ఇతర లబ్ధిదారులకు రూ.2,59,83,796 లబ్ధిదారులకు కలిపి గ్రామంలో 4 సంవత్సరాలకు సంబంధించి రూ.14,06,31,260 లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంలో ఇవి కాక గ్రామ సచివాలయ భవనం, ఆర్బీకే సెంటర్, వెల్నెస్ సెంటర్ నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మాజీ సర్పంచ్ జంపన సుబ్బరాజు, పల్లా త్రిమూర్తులు, సీనియర్ పార్టీ నాయకులు పోలిమాటి రాజారత్నం, నాని, వీర్రాజు తదితరుల ఆధ్వర్యంలో గ్రామంలో పర్యటించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, గారపాటి గంగారామ్ చౌదరి, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట బస్టాండ్‌లో లీజుకు స్థలం

అమలాపురం రూరల్: అమలాపురం ఆర్టీసీ డిపో పరిధిలోని అంబాజీపేట బస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న 2730 గజాల ఖాళీ స్థలాన్ని ఐదేళ్లకు అద్దె ప్రాతిపదికన లీజుకు ఇవ్వటానికి టెండర్లు పిలుస్తున్నట్లు డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి తెలిపారు. టెండర్ ఫారాలు అమలాపురం ఆర్టీసీ డిపో, కోనసీమ డీపీటీఓ కార్యాలయాల్లో ఈ నెల 29 తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోపు విక్రయిస్తారన్నారు. పూర్తి చేసిన టెండర్ ఫారాలు ఈ నెల 30న అంబాజీపేట బస్‌స్టేషన్‌లో సమర్పించాలన్నారు.

అమ్మో కంట్లో దుమ్ము..



జొన్నాడ-రావులపాలెం మధ్య ఉన్న గౌతమీ వంతెనపై పేరుకుపోయిన చెత్త

ఆలమూరు: 216 ఏ జాతీయ రహదారిలోని జొన్నాడ-రావులపాలెం మధ్యనున్న గౌతమీ పాత, కొత్త వంతెనలపై ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. నెలల తరబడి రోడ్డుకు ఇరువైపులా శుభ్రం చేయకపోవడంతో రెయిలింగ్ గోడల వెంబడి దుమ్ము, ధూళి, వ్యర్థాలు పేరుకుపోయాయి. దీనివల్ల వాహనదారులు ప్రయాణించేటప్పుడు ఆ దుమ్ము కళ్లలో పడటంతో తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఒక్కోసారి ప్రమాదాలు జరిగి గాయాలపాలవుతున్న పరిస్థితి. దీనిపై హైవే అధికారులు సత్వరమే స్పందించి వంతెనలకు ఇరువైపులా చెత్త, చెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదు

ఆత్రేయపురం: ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఇబ్బందులు పెట్టవద్దని, ఏ సమస్య ఉన్నా, ఏ సమయంలోనైనా తన దృష్టికి తీసుకుని వస్తే రైతులకు ధాన్యం కొనుగోలుకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని మెర్లపాలెం గ్రామంలో గడప గడపకూ కార్యక్రమంలో పర్యటిస్తుండగా వసంతవాడ గ్రామ రైతులు ఆయనను కలిసి ధాన్యం కొనుగోలులో ఇబ్బందులను వివరించారు. గోనె సంచులు, వాహన సదుపాయం కల్పించాలని రైతులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఆర్డీవో ఎం.ముక్కంటితో కలసి వసంతవాడ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ సచివాలయంలో రైతులు, అధికారులు, మిల్లర్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ గోనె సంచులు కొరత లేకుండా చూడాలని, రవాణా వాహనాలు ఏర్పాటులో శ్రద్ధ వహించాలని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. ఆర్డీఓ ఎం.ముక్కంటి మాట్లాడుతూ శుక్రవారంకు 10 వేల సంచులు, 15 లారీలు ఆత్రేయపురం మండలానికి వచ్చేలా చూస్తామన్నారు. అనంతరం రైతులు, అధికారులతో కలసి లొల్ల రైస్ మిల్లును సందర్శించి రైతుల సమక్షంలో శాంపిల్స్ కలెక్షన్, నూక శాతం నిర్ధారణ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఎంపీడీఓ నాతిబుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఏఓ పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

కోళ్లను చంపించారంటూ ఫిర్యాదు

అయినవిల్లి: తన కోళ్లఫారం తాళాలు పగలగొట్టి కోళ్లను కుక్కలతో చంపించారంటూ ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం తొత్తరమూడి టీటీఆర్ నగర్‌కు చెందిన బద్రి శ్రీనివాసరావుకు అయినవిల్లిలోని మెట్ల కాలనీ సమీపంలో గన్నవరపు దిలీప్‌కుమార్‌కు చెందిన కొబ్బరితోటను లీజుకు తీసుకుని కోళ్లఫారం ఏర్పాటు చేసుకున్నాడు. లీజు విషయంలో దిలీప్‌కుమార్‌కు శ్రీనివాసరావుకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తన కోళ్లఫారం తాళాలు పగలగొట్టి కుక్కలను పంపించి రూ.లక్ష విలువైన కోళ్లను చంపించాడంటూ ఆరోపిస్తూ ఫిర్యాదు చేశాడు. దీనిపై బద్రి శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.